క్లుప్తంగా

టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

రాయికోడ్(అందోల్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి పాండెన్ సూచించారు. మండలంలోని శంశొద్దీన్‌పూర్ గ్రామంలో పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాల్లో 1,250 ఆవులు, ఎద్దులు, గేదెలకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేశామన్నారు. వచ్చే నెల 10 వరకు టీకాలు వేస్తామన్నారు. పశువు మేత మేయకపోవడం, పాల ఉత్పత్తి తగ్గడం, జ్వరం బారిన పడటం, నోటి నుంచి సొంగ కార్చడం, కాళ్లకు బొబ్బలు రావడం గాలికుంటు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలని పోషకులకు వివరించారు. పోషకులు నిర్లక్ష్యం చేయకుండా విధిగా తమ పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది దేవిదాస్, ఘని, పశుపోషకులు ఉన్నారు.

3న ప్రమాణ స్వీకారం



కరపత్రాలను విడుదల చేస్తున్న అనంత కిషన్

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం 3వ తేదీన సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవీ కన్యక పరమేశ్వరీ ఆలయంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజీ అనంత కిషన్ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ సుజాత హాజరవుతారని తెలిపారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో అధ్యక్షుడు విద్యాసాగర్, వర్కింగ్ అధ్యక్షుడు పూర్ణ చంద్ర శేఖర్, ప్రధాన కార్యదర్శి నామ భాస్కర్, కోశాధికారి ఆమెటి భాస్కర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలపై గ్రామసభ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఉపాధిహామీ పనుల్లో జరిగిన అక్రమాలపై మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో పనులు చేయకపోయినా రికార్డుల్లో చేసినట్లు, స్థానికంగా లేనివారి పేర్లు జాబితాలో నమోదు చేసి కూలీ డబ్బులు స్వాహా చేశారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈసభలో ఏపీవో మాణిక్‌రావు, ఆడిటర్ మౌనిక, ఎస్ఆర్‌పీ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి విఘ్నేష్, మాజీ సర్పంచ్ గంగయ్య, నాయకులు తాహెర్‌అలీ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ చట్టం తీసుకురావాలి



కార్మికులతో మాట్లాడుతున్న చిరంజీవి

నారాయణఖేడ్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టం తీసుకురావాలని ఏఐటీయూసీ జి ల్లా నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఖేడ్‌లో ఆయన భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాలీచాలని కూలీ డబ్బులతో కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం గుర్తింపుకార్డులు ఇచ్చి సంక్షేమం కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు.

6న నవచండీ మహాయాగం

నారాయణఖేడ్: ఖేడ్‌లో వచ్చేనెల 6న లలితాదేవి వైభవం ట్రస్టు ఆధ్వర్యంలో నవచండీ మహాయాగం, రాజరాజేశ్వరీ కల్యాణం, సాయంత్రం 5 గంటలకు గరికపాటి నర్సింహారావుచే దివ్య ప్రవచనం నిర్వహించనున్నట్లు ట్రస్టు బాధ్యుడు మోహన్ జ్యోషి తెలిపారు.

రైతు పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రైతు సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి, పటాన్‌చెరు పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సన్నవడ్లకు మద్దతు ధరకు అదనంగా 500 రూపాయల బోనస్ అందజేయనున్నట్లు చెప్పారు. ఏ1 గ్రేడ్ క్వింటాలుకు రూ.2,320, సన్నవడ్లకు క్వింటాలుకు 2,820 రూపాయలు మద్దతు ధర అందిస్తోందని తెలిపారు. దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గవ్యాప్తంగా 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు రాఘవేంద్రారెడ్డి, భిక్షపతి, కాంగ్రెస్ పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, డైరెక్టర్లు, అధికారులు, సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపికలో పారదర్శకత పాటించండి

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసే క్రికెట్ క్రీడాకారుల జట్టులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, ఎంపిక పారదర్శకంగా జరిగేలా చూడాలని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రీ క్రికెట్ క్లబ్ సభ్యులు అన్నారు. ఆ మేరకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు హనుమంతరావు, సభ్యులు పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డి తనకు నచ్చిన వారిని జట్టుకు ఎంపిక చేస్తున్నారని తెలిపారు. ఈ సమయంలో ఆయా నియోజకవర్గ పరిధిలోని క్రికెట్ క్లబ్‌లను సంప్రదించడం లేదన్నారు. జిల్లా అసోసియేషన్‌కు మంజూరయ్యే నిధుల ఖర్చులో సైతం అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, త్వరలోనే జిల్లా కార్యదర్శి, హెచ్‌సీఏ చైర్మన్‌తో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మార్కెట్ రోడ్డులో రూ. 2 కోట్ల జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ కు నాణ్యతా ప్రమాణాలు పాటించి, సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ నరేందర్, ఏఈ సురేశ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు పరిహారం అందజేత

జిన్నారం (పటాన్‌చెరు) : బాధిత రైతుకు నష్టపరిహారాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అందజేశారు. ఇటీవల కాలుష్య జలాలు తాగి 18 గేదెలు మృతిచెందిన ఘటనపై గడ్డపోతారం పారిశ్రామికవాడలోని మోడ్రన్ ఇండస్ట్రీస్ యాజమాన్యంతో చర్చించి శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో బాధిత రైతు బసెట్టిగారి సాయికుమార్‌కు రూ.16 లక్షల పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రకాశం చారి, స్థానిక నాయకులు, శ్రీనివాస్, రాజు, గణేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

● ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/కల్హేర్(నారాయణఖేడ్): రైతులు అధైర్యపడొద్దని, కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నిజాంపేట్ మండలంలోని జంబికుంటలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తమ ఉత్పత్తులను తెచ్చి విక్రయించాలని కోరారు. ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందని, సాంకేతిక సమస్యల వల్ల కొందరికి మాఫీ కాకపోయినా లోపాలు సరిచేసి అందరికీ మాఫీ అయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. అధికంగా తరుగు తీసి రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్ కుమార్, మాజీ ఎంపీపీ అంతన్నగారి మల్లేశం, నిజాంపేట మాజీ సర్పంచ్ జగదీశ్వరాచారి, మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, రాధాకిషన్ పాల్గొన్నారు. అలాగే కల్హేర్ మండలం ఫత్తేపూర్, బీబీపేట, సిర్గాపూర్ మండలం బోక్కస్‌గాం, పోచాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్లు గుండు వెంకట్రాంలు, నరేందర్‌రెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ గుండు నరేందర్, నాయకులు దేవదాస్, బండారి సాయిలు, కృష్ణమూర్తి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ నిలిపేయాలి

పటాన్‌చెరు టౌన్: పెద్ద కంజర్లలో రైతుల నుంచి ప్రభుత్వం సేకరిస్తున్న బలవంతపు భూసేకరణను వెంటనే నిలిపివేయాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో రైతులు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రంగారావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల నుంచి 20 ఎకరాలను టౌన్ షిప్ అభివృద్ధి పేరుతో భూసేకరణకు పూనుకుందని గుర్తుచేసుకున్నారు. ఎకరాకు 15 లక్షల 75 వేల రూపాయలను నష్టపరిహారం లెక్కకట్టిందన్నారు. సుమారుగా 100 మంది రైతులకు పరిహారం అందలేదన్నారు. గ్రామంలో గ్రామ సభ నిర్వహించకుండా రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా గత ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేపట్టిందన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ అధికారులు సైతం వచ్చి పరిహారం ఇవ్వకుండా బలవంతపు భూసేకరణ చేపడుతున్నారన్నారు. హెచ్‌ఎండీఏ చర్యల వల్లా గ్రామ రైతులు తమ విలువైన భూములను కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. వారికి పరిహారం ఇచ్చేంత వరకు భూసేకరణ చేపట్టవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు జంగయ్య, ముత్యాలు, నర్సింహులు, దుర్గయ్య, నగేశ్ నాగభూషణం గ్రామ రైతులు పాల్గొన్నారు.

కార్యదర్శులపై చర్య తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మునిపల్లి(అందోల్): గ్రామ పంచాయతీ కార్యదర్శులపై చర్య తీసుకోవాలని సీఐటీయూ మండల నాయకుడు రమేశ్‌గౌడ్ ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రామలింగంకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వర్కర్లు నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీ వర్కర్లకు ఇన్సూరెన్స్ చేయాలన్నారు. ఖమ్మంపల్లి, హైద్లాపూర్, మల్లికార్జునపల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీ వర్కర్లు మృతి చెందినా.. ప్రభుత్వం నుంచి వర్కర్లకు ఎలాంటి సాయం అందలేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ వర్కర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం మండలాధ్యక్షులు ఇమానియల్, రవి, విఠల్‌గౌడ్, భిక్షపతి, దశరథ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్‌పై అవగాహన సదస్సు



అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్లు

జిన్నారం(పటాన్‌చెరు) : ప్రతీరోజు తీసుకునే ఆహారంలో అయోడిన్ ఉండేలా చూసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాధికారులు సూచించారు. మండలంలోని అన్నారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయోడిన్ లోపం నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. మనం రోజూ తీసుకునే ఆహారంలో తప్పకుండా ఇది ఉండేలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా క్యారెట్, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ తదితర వాటిలో ఎక్కువగా ఉంటుందన్నారు. మనం తినే వాటిలో ఇది ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, వసంత, ఈఓ సంగీత, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, గర్భిణులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం పత్రాల అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలోని వింధ్య ఆర్గానిక్ పరిశ్రమ యాజమాన్యం, పరిశ్రమ కార్మికులు, కార్మిక నాయకులు వేతన ఒప్పందం చేసుకున్నారు. శుక్రవారం రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి .. యాజమాన్యంతో చర్చించి 10,100 రూపాయల వేతన ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ పత్రాలను కార్మిక శాఖ అధికారి రవీందర్ రెడ్డి సమక్షంలో కార్మికులకు ఇచ్చారు. అధికారికి కార్మికులు సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అంబర్య తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలం చినకంజర్లకు చెందిన కౌలు రైతు శ్రీనివాస్ పొలంలో 45 ఏళ్ల వయసు కలిగిన మహిళ మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పది రోజులు క్రితం చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కౌలు రైతు శ్రీనివాస్ జర్వం బారిన పడటంతో అప్పటి నుంచే పొలం వద్దకు వెళ్లడం లేదు. శుక్రవారం వెళ్లి చూస్తే మృతదేహం బాగా కుళ్లి ఎముకల గూడు కన్పించింది. దీంతో వెంటనే పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు చెబితే అతను పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ వాటర్ మెన్‌లకు శిక్షణ

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలో వివిధ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న గ్రామ వాటర్ మెన్‌లకు మిషన్ భగీరథ అధికారులు శుక్రవారం శిక్షణ నిచ్చారు. గ్రామంలో నీటి సరఫరా ఎలా నిర్వహించాలో వాటర్ మెన్‌లకు తెలిపారు. గ్రామాల్లో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీరు ప్రతీ ఇంటికి చేరేలా చూడాలన్నారు. తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని వాటర్ మెన్‌లకు సూచించారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలి

● డీపీఓ సాయిబాబ



నీటి తొట్టిని పరిశీలిస్తున్న డీపీఓ సాయిబాబ

కంది(సంగారెడ్డి): గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని డీపీఓ సాయి బాబ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కాశీపూర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డీపీఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలన్నారు. పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీనెల వాటర్ ట్యాంక్‌లను కడిగి శుభ్రం చేస్తుండాలన్నారు. పాత టైర్లు, పూల కుండీల్లో నిలిచే నీటితో దోమలు అధికమై ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంటుందని తెలిపారు. అంతకు ముందు గ్రామంలో డ్రైడే సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో డీపీఓ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

● జిల్లా మాతాశిశు సంక్షేమ అధికారి లలితకుమారి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా మాతాశిశు సంక్షేమ అధికారి లలితకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, వసతి గృహాలు, అంగన్‌వాడి సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలోని పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అంగన్ వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరును పెంచాలని సూచించారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం ఇవ్వాలని సూచించారు. ఆమెతో పాటు ఎంపీడీఓ సుధాకర్, జహీరాబాద్ ప్రాజెక్టు అధికారి అంజమ్మ, పంచాయతీ కార్యదర్శి సరస్వతి ఉన్నారు.

సీఐటీయూ ధర్నా



ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) వెంటనే పెండింగ్‌లోని వేతనాలు చెల్లించాలని ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేసే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు కోరారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో హాస్పిటల్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ నాలుగు నెలలుగా ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేసే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. దాంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంలో కలెక్టర్, మంత్రి చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు. సోమవారం వరకు పెండింగ్ వేతనాలు ఇవ్వని పక్షంలో విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, యాదయ్య, సాయిలు, సంతోష, అంసమ్మ, పోచమ్మ, లక్ష్మిలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్: ప్రజా జీవితంలో ఆరోగ్యం ముఖ్యమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలో శుక్రవారం హ్యాపీ హెల్త్ కేర్ మల్టీస్పెషాలిటీ క్లీనిక్‌ను సందర్శించి దంత చెకప్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ సోషల్ మీడియా బాధ్యులు

నారాయణఖేడ్: సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం కాంగ్రెస్ సోషల్ మీడియా బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ సోషల్‌మీడియా విషయాలపై ఆయనతో చర్చించారు. ఎంపీ షెట్కార్ కుమార్తె గిరిజా షెట్కార్ తదితరులు ఉన్నారు.

8 మంది జూదరులపై కేసు



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రాజేశ్ నాయక్

మునిపల్లి(అందోల్): మండలంలోని బొడ్పట్‌పల్లికి చెందిన 8 మంది పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ తెలిపారు. శుక్రవారం కొండాపూర్ సీఐ చంద్రయ్య ఆధ్వర్యంలో బొడ్పట్‌పల్లిలో పేకాట ఆడుతున్న వారిపై పక్కా సమాచారంతో దాడులు చేసి రూ. 48.380తో పాటు 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. 8 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ **తిరుపతి బస్సు వేళల్లో మార్పు**

జహీరాబాద్ టౌన్: భక్తుల సౌకర్యం కోసం జహీరాబాద్ నుంచి తిరుపతికి నడుపుతున్న సూపర్ లగ్జరీ బస్సు వేళలో మార్పులు చేసినట్లు మేనేజర్ జాకీర్ హుసేన్ తెలిపారు. జహీరాబాద్ నుంచి రోజు సాయంత్రం 6 గంటలకు నడిచే బస్సు ఇక నుంచి మధ్యాహ్నం 1.15 గంటలకు బయలుదేరి తెల్లవారుజాము 3.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఉదయం 9 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి రాత్రి 10.45 గంటలకు జహీరాబాద్ డిపోకు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి మారిన వేళలు అమలు అవుతాయన్నారు.

◆ **ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన**

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలం బిలాల్‌పూర్‌లో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగిన ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా హోమం, యజ్ఞం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. మహిళలు బోనాలతో తరలివచ్చి పూజలు చేశారు.

◆ **10న 'పిల్లల పండుగ'**

జహీరాబాద్ టౌన్: శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నవంబర్ 10న 'పిల్లల పండుగ' నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడేళ్ల నుంచి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీయడానికి ఈ పండుగ చేపడుతున్నామన్నారు. పట్టణంలోని పస్తాపూర్ ఆర్ఎల్ఆర్ స్కూల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని 80 పాఠశాలల నుంచి 3 వేల మంది పిల్లలు పాల్గొంటారని చెప్పారు. మూడు కేటగిరిలో 30కి పైగా ఈవెంట్స్ ఉంటాయన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

◆ **అంగన్‌వాడీకి సామగ్రి అందజేత**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్(కే) అంగన్ వాడీ కేంద్రానికి క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ ఇండియా ఫౌండేషన్ వారు వివిధ రకాల సామగ్రిని శుక్రవారం అందజేశారు. చిన్నారులకు 20 కుర్చీలు, మహిళలకు నాలుగు పెద్ద కుర్చీలు, రెండు కార్పెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ ఉమారాణి, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, క్రెడిట్ యాక్సెస్ సంస్థ నిర్వాహకులు సత్తిబాబు, సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ధర్నాకు తరలిన కార్మికులు**

నారాయణఖేడ్: మున్సిపాలిటీలో ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్న కార్మికులు తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయడంతో పాటు కనీసం వేతనంగా రూ. 26 వేలు చెల్లించాలని సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో పాల్గొనేందుకు శుక్రవారం ఖేడ్ మున్సిపాలిటీకి చెందిన కార్మికులు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారుగు సేవల కింద పనిచేస్తున్న వారికి కేటగిరిల వారీగా వేతనాలు, డీఏ ఇస్తూ ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

◆ **అమరుల కుటుంబాలకు సీఐ పరామర్శ**

సంగారెడ్డి క్రైమ్: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని టౌన్ సీఐ భాస్కర్ అన్నారు. పోలీసు అమరుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సంగారెడ్డిలో అమరులైన పోలీసుల కుటుంబాలను పరామర్శించారు. మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి ఉద్యోగంతో పాటు ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు.

◆ **అన్నదానం**

జిన్నారం (పటాన్‌చెరు) : బొల్లారం మున్సిపాలిటీలో గాంధీనగర్ కాలనీ వ్యవస్థాపకుడు, వార్డు మాజీ సభ్యుడు మల్లారెడ్డి వర్ధంతిని శుక్రవారం జరిపారు. ఆయన విగ్రహానికి స్థానికులతో కలిసి మల్లారెడ్డి తనయుడు యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీనగర్ కాలనీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం డిజైర్ సొసైటీలో వ్యాధిగ్రస్త పిల్లలతో కలిసి వేడుకలను నిర్వహించారు. అన్నదానాన్ని నిర్వహించి పండ్లు, చాక్లెట్లు అందజేశారు.

◆ **గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం**

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఎస్ఏ గార్డెన్ సమీపంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఇక్బాల్ షటర్ వద్ద సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు సమాచారం ఇచ్చారు. మానసికస్థితి సరిగా లేక భిక్షాటన చేస్తూ తిరిగేవాడని ఎవరూ పట్టించుకోకపోవడం తిండిలేక చనిపోయినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి ఒంటిపై గులాబీ కలర్ టీషర్ట్, కలర్ దుప్పటి ఉందన్నారు. ఆచూకీ తెలిస్తే పోలీస్‌లను సంప్రదించాలని సీఐ తెలిపారు.

◆ **విద్యార్థికి సన్మానం**

మునిపల్లి(అందోల్): మధురైలో ఏఐఐఎంఎస్ సీటు సాధించిన విద్యార్థి రాజకుమారికి మాజీ ఎంపీటీసీ మనోహర్‌యాదవ్ సన్మానించారు. శుక్రవారం బుదేరా గ్రామనికి చెందిన భాగ్య లక్ష్మి రాజు (టీచర్) కూతురు రాజకుమారి ఏఐఐఎంఎస్ మధురైలో సీటు సాధించింది. దీంతో మండలంలోని బుదేర జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్ ఏఎస్పీ, సీనియర్ అడ్వొకెట్ అనందం, ఎంఈఓ భీమ్‌సింగ్, డాక్టర్ మారుతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **మందుబాబులకు జరిమానా**

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లాకోర్టు జరిమానా విధించింది. గురువారం అర్ధరాత్రి సంగారెడ్డిటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ సుమన్ కుమార్ ఆధ్వర్యంలో పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా, ఇద్దరు వాహనదారులు మద్యం తాగి పట్టుపడ్డారు. వాహనాల తనిఖీల్లో పట్టుపడ్డ వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా, జిల్లా జడ్జి ఒక్కొక్కరికీ రూ. 2 వేల చొప్పున జరిమానా విధించినట్లు సంగారెడ్డిట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **దీపావళి టపాసులు స్వాధీనం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : అనుమతులు లేకుండా దీపావళి టపాసులు కలిగి ఉన్న ఓ వ్యక్తిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌కాలనీ చెందిన ఆదినారాయణ ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున దీపావళి టపాసులు కలిగి ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ ఆదేశాల మేరకు ఎస్ఐ నారాయణ గౌడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. టపాసులకు ఎలాంటి అనుమతులు లేవని తెలియడంతో వెంటనే ఆదినారాయణను అదుపులోకి తీసుకొని టపాసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.